# ఒక మీమాంస

ఈ దేశంలో పాపులారిటీకి,ప్రాముఖ్యతకీ చాలా తేడా వుంది. ఓ అమ్మాయిని ఓ రాత్రి రేప్ చేస్తే చచ్చేంత పాపులారిటీ వస్తుంది.దేశంలో అన్ని పేపర్లలోనూ ఫొటోలు పడతాయి. ఆ అమ్మాయిని చంపినా అతన్ని మాత్రం చంపడం మహా పాపమని వి.అర్.కృష్ణ య్యర్,మహేష్ భట్ దగ్గరనుంచి మామూలు మనిషి దాకా గగ్గోలు పెడతారు.చివరి క్ష ణంలో అతను తుమ్మాడా, అమ్మా అన్నాడా,సంగీతం వింటానన్నాడా-యివన్నీ ఉత్సాహకరంగా వుంటాయి. ప్రజలకి బోలెడంత మెలోడ్రామా. 14 ఏళ్ళ క్రిందట-14ఏళ్ళ హితల్ పారీఖ్ 'అమ్మా అని ఏడ్చిందా, పీక నొక్కుతున్నప్పుడు 'అమ్మో' అని గోల పెట్టిందా- ఎవరికీ గుర్తుండదు. గుర్తుండాల్సిన అవసరమూ లేదు. ఆ బాధ ఆజన్మాంతమూ ఆ కుటుంబానిది. దేశానిది కాదు.

చాలా సంవత్సరాల క్రితం అమెరికాలో ఒకాయన చాలా మందిని అతి దారుణంగా హత్యలు చేశాడు. చివరకి దొరికిపోయాడు. అతని పేరు కారల్ చెస్‌మెన్. చెస్‌మన్ చాలా అందమైన హంతకుడు.చంపినప్పుడు ఏమోగాని బయట చార్లెస్ శోభరాజ్ అంత గ్లామరస్‌గా వుంటాడు. అతనికి న్యాయ స్థానం మరణ శిక్ష విధించింది. ఆ రోజుల్లో కారల్ చెస్‌మెన్ కోసం చాలా మంది కన్నీరు కార్చారు.కవిత్వం చెప్పారు.అమ్మాయిలు ప్రేమలో పడ్డారు. కారల్ చెస్‌మెన్ మీద శిక్ష అమలుజరపడం ఆ రోజుల్లో అద్భుతమయిన హాలీవుడ్ సినీమా.

న్యాయస్థానం జరిగిన ఘాతుకాని చూస్తుంది. ప్రజలు జరుపుతున్న శిక్షని మాత్రమే చూస్తారు. ధనంజయ్ చటర్జీ తల్లిదండ్రుల ఫొటోలు పత్రికల్లో కనిపించినంత విరివిగా హితల్ పారెఖ్ తల్లిదండ్రుల కన్నీళ్ళు పత్రికల్లోకి జార లేదు. పద్నాలుగేళ్ళు ఆ ఘాతుకాన్ని తలుచుకొంటూ నిశ్శ బ్దంగా వర్తమానాన్ని అంగీకరించిన కుటుంబమది.

అలాగే రెండో ప్రపంచ యుద్ధంలో ఎన్నో లక్షల మంది చావుకి కారణమయిన అడోల్ఫ్ ఈక్‌మన్ దాదాపు నలభైయ్యేళ్ళ క్రిందట దొరికాడు. ప్రస్తుతం దేవుడు,నీతి,వృ ద్ధాప్యం వంటి కొత్త జబ్బులు అతన్ని ఆవరించుకొన్నాయి. వృద్ధ నారీ పతివ్రత అన్నది సామెత.

పెళ్ళాన్ని తందూరీ పొయ్యిలో కాల్చిన భర్తగారి కథ తెలిసినట్టుగా-ఈ తరానికి వినోభా భావే గారి గురించి తెలియకపోవచ్చు. సానొభూతి,ఆర్ద్రత కూడా విచక్షణకి అవకాశం యివ్వని అందమైన బలహీనతలు. మదర్ థెరెస్సా పొయినప్పుడు ఎవరో దగ్గర బంధువ పోయినట్టు భోరున ఏడ్చాను. 'మీరు ఓవర్ రియాక్ట్ అవుతున్నారేమో' అన్నాడు నా మిత్రుడు. ధనంజయ్ ఛటర్జీ విషయంలో కూడా ఈ దేశం ఓవర్ రియాక్ట్ అవుతోందనుకొంటే ఆశ్చర్యంలేదు. నాలుగు సార్లు సుప్రీంకోర్టు,రెండు సార్లు ఇద్దరు రాష్ట్రపతులు,దాదాపు అన్ని దశల న్యాయస్థానాలూ నిర్ణయం తీసుకొన్నాక మొన్న శిక్ష అమలు జరిగింది.

నేరం రహస్యంగా జరుగుతుంది.శిక్ష బహిరంగంగా సాగుతుంది. పదిమంది మధ్య ఆవేశం అతి వేగంగా పుంజు కొన్నట్టే-పదిమంది మధ్య ఆర్ద్రత అంతే వేగంగా దావానలంలాగా పుంజుకొంటుంది.

మాదకద్రవ్యాలు రవాణా చేసినందుకు-ఈ శిక్ష తర్వాతే-ఒక భారతీయుడికి మరణశిక్ష విధించి అమలు చేశారు. మరి ఆ దేశంలో ఎవరూ ఆక్షేపించిన దాఖలాలు కనిపించలేదు.

'మాన్ ఫ్రైడే' అనే నవలలో ఒక నీగ్రో బానిస రాబిన్‌సన్ క్రూసోని అడుగుతాడు:'ఆట అంటే ఏమిటి?'అని. బాగా

ఆలోచించి 'మన ఆనందంకోసం ఎదుటివాడిని హింసించడం' అంటాడు రాబిన్‌సన్ క్రూసో.

ఒలింపిక్స్ చూసే ఎవరికైనా-నెలల తరబడి రక్తం ఓడ్చి కష్టపడి,250 కేజీల గుళ్ళ ఎత్తి ఓ బంగారం బిళ్ళని సంపాదించకపోతే ఏమొచ్చిందని అనిపించవచ్చు.

సంస్కృతి మనిషిలో ఒక నియతిని ఏర్పరిచింది.సభ్యసమాజం క్రమ జీవనానికి కొన్ని షరతుల్ని తనకు తానే ఏర్పరుచుకొంది.చట్టం బలం ఆ సమాజం గౌరవించే నైతిక విలువలే. చట్టం ఆంక్షలు విధిస్తుంది.హెచ్చరిస్తుంది. ఒకప్పుడు కళ్ళెర్ర జేస్తుంది.ఇంకా శృతి మించితే హింసిస్తుంది. అంటే 'సంస్కారం' ఏర్పరిచిన చివరి ఆయుధం-మళ్ళీ మనిషి ప్రాధమిక ప్రవృత్తే!

మరణ శిక్షని అమలు జరిపే ముందు ఆ వ్యక్తి ఏ కారణానికీ అస్వస్థతతో వుండరాదు.అన్ని విధాలా ఆరోగ్యంగా వున్న వ్యక్తినే వురి తీసే నియమం చట్టం నిర్ణయించింది. బాధితుడిని హింసించే హక్కు చట్టానికి లేదు.

మరి అభ్యుదయం పేరిటో, స్వార్ధం పేరిటో,స్వంత లాభానికో,సొంత సుఖానికో-పక్క వాడిని హింసించి-అతని శ్రేయస్సుతో ప్రమేయం లేకుండా అతన్ని దారుణంగా చంపే నేరంమాట!

ఇలా ఆలోచిస్తూ పోతే చట్టం గుడ్డిది. న్యాయం క్రూరమైనది.ఎటొచ్చీ మనిషే మంచీ చెడుల మధ్య అటూ ఇటూ ఊగిసలాడే ఓ వింత ప్రాణి.